## పోడూరులో వర్షం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలో గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు చాలా చోట్ల పాడైపోవడం వల్ల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జగన్నాథపురం, పండితవిల్లూరు, పెనుమదం, గుమ్మలూరు గ్రామాల్లోని కాలనీల్లో నీరు రోడ్లపైకి చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

రోడ్డుపై వర్షపు నీరు

# జ్వరం.. జలుబు.. దగ్గు..!

'పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా రెండు జిల్లాల్లోనూ వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. జనం జ్వరాలతోపాటు దగ్గు, జలుబుతో సతమతమవుతున్నారు. దీంతో పట్టణాల్లో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆర్ఎంపిలను, స్థానిక మందుల దుకాణదారులను ఆశ్రయించి చికిత్స పొందుతున్నారు. దీనికితోడు టైఫాయిడ్ కేసులు ఎక్కువగా, డెంగీ, మలేరియా కేసులు అక్కడక్కడా నమోదు కావడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది.



**మూలుగుతున్న పల్లెలు, పట్టణాలు**

**చేతిలో చిల్లిగవ్వ లేక వైద్యం కోసం జనం అవస్థలు**

**ఆర్ఎంపిలు, మందుల దుకాణాలే దిక్కు**

**ఆరోగ్య సురక్ష సర్వేలో వైద్య శాఖ సిబ్బంది**

ప్రజాశక్తి - భీమవరం

జిల్లావాసులు జ్వరాలతో మూలుగుతున్నారు. వాతావరణ మార్పులు, పారిశుధ్యం పడకేయడం, కలుషిత నీరు తదితర కారణాల రీత్యా వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. పట్టణాల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో ఓపిలో సగానికిపైగా జ్వరాల కేసులే ఉంటున్నాయి. మిగిలిన సగంలోనూ 90 శాతం శ్వాసకోశ సంబంధిత సమస్యలు, దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారే ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనైతే ఇంటింటికీ వెళ్లి వైద్యం అందించే ఆర్ఎంపిలకు డిమాండ్ పెరిగింది. ఆసుపత్రికెళ్తే ఓపి చీటీ దగ్గర నుంచి పరీక్షలు, మందులు అన్నింటికీ సుమారు వెయ్యి రూపాయలపైనే ఖర్చవుతుంది. ఒకవేళ రక్త, నీరుడు పరీక్షలు వంటివి రాస్తే ఖర్చు వేలల్లోనే ఉంటోంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడం, ఉపాధి పనులూ అంతంతమాత్రంగా చూపడం, చేసిన పనులకు సంబంధించిన బకాయిలు చెల్లించకపోవడం తదితర కారణాల రీత్యా గ్రామీణ పేదలకు ఇల్లు గడవడమే కష్టంగా ఉంది. ఈ పరిస్థితుల్లో వైద్యానికి వేలల్లో ఖర్చు పెట్టే పరిస్థితి లేక ఆసుపత్రులకు వెళ్లలేక బాధితులు ఆర్ఎంపిలను ఆశ్రయిస్తున్నారు. తర్వాత డబ్బులిచ్చే ప్రాతిపదికన ఆర్ఎంపిలు జ్వరపీడితులకు ఇంజెక్షన్లు, మందులు అందిస్తుండటం పేదలకు ఊరటనిచ్చే అంశంగా మారింది. తాము గత నెల నుంచి మందులు దుకాణాల వద్ద అరువు ప్రాతిపదికన మందులు తీసుకొచ్చి వైద్య సేవలందిస్తున్నామని, వైరల్ జ్వరాలు, శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయని ఏలూరు, పెనుమంత్ర ప్రాంతాలకు చెందిన ఆర్ఎంపిలు చెబుతున్నారు. ప్రస్తుతం పనులకు అన్‌సీజన్ కావడంతో జనం వద్ద డబ్బుల్లేవని, దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో తర్వాత సొమ్ములిచ్చేలా వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ఇక పట్టణాల్లో అయితే ఎక్కువగా మెడికల్ షాపుల వద్దకు వెళ్లి మందులు కొని తెచ్చుకుని వేసుకోవడం కన్పిస్తోంది. జ్వర పీడితులు రెండు నుంచి ఐదు రోజుల్లో కోలుకుంటున్నా విపరీతమైన నీరసంతో బాధపడుతున్నారు. దీంతో వారు మరో వారం రోజులు గడప దాటలేని పరిస్థితి ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆయా కుటుంబాలు పస్తులుండాల్సిన దుస్థితి దాపురించింది.

ఇక టైఫాయిడ్, మలేరియా, డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఐదు రోజుల్లో జ్వరం తగ్గనివారు రక్త పరీక్షలు చేయించుకుంటే టైఫాయిడ్ జ్వరాలుగా నిర్ధారణ అవుతోంది. దీంతో పరీక్షలకు, తర్వాత కోర్సు వాడకానికి వేలల్లో ఖర్చవుతుందని జనం గగ్గోలు పెడుతున్నారు. డెంగీ కేసులు కూడా అక్కడక్కడా వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల భీమడోలు మండలంలో డెంగీ కేసు నమోదైన సంగతి తెలిసిందే. అధికారికంగా వెలుగులోకి వస్తున్న కేసులు కొన్నే ఉంటున్నాయి. ప్రయివేటు ఆసుపత్రుల్లో నిర్ధారించిన కేసులు పెద్దగా అధికార యంత్రాంగమూ పరిగణనలోకి తీసుకోవడం లేదు. మొత్తంగా చూస్తే వైరల్ జ్వరాలతోపాటు టైఫాయిడ్, మలేరియా, డెంగీతో రెండు జిల్లాలవాసులు మూలుగుతున్నారు.

జ్వరాలతో జనం సతమతమవుతుంటే ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం, పిహెచ్‌సిల్లో వసతులు మెరుగుపర్చి అన్ని రకాల మందులు అందించడం వంటి చర్యలు చేపట్టడంలో ఉదాశీనత కన్పిస్తోందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది ఉండటంతో గ్రామాల్లో జనం ఆరోగ్య సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేకుండాపోయింది. ప్రభుత్వం స్పందించి జ్వరాల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రధానంగా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అదే సమయంలో జ్వరపీడితులకు పిహెచ్‌సిలు, ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించడంతోపాటు అవసరమైన మందులు ఇవ్వాలని, కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలని జనం కోరుతున్నారు.

యలమంచిలి: నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

## ఒపిఎస్‌ను అమలు చేయాలి

**నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన**

ప్రజాశక్తి - యలమంచిలి

సిపిఎస్ స్థానంలో అత్యంత దుర్మార్గమైన జిపిఎస్ తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నాలకు నిరసనగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం మండలంలోని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.క్రాంతి కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమానుషమైన సిపిఎస్‌ను రద్దుచేసి అంతకంటే దుర్మార్గమైన జిపిఎస్‌ను బలవంతంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులపై రుద్దే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పి.రామ్మూర్తినాయుడు, నాయకులు ఎస్ఎస్‌వి.అవధాని, బివి.విజయపద్మ, రామేశ్వరపు సత్యనారాయణ, దొమ్మేటి చంద్రశేఖరరావు, సఖిలే వెంకటేశ్వరరావు, డివివి ఆదినారాయణ, టి.గాంధీ, వైవి.చల్లారావు, ఎస్.వెంకట రామయ్య పాల్గొన్నారు.

**మొగల్తూరు** : సిపిఎస్‌పై ప్రభుత్వం ఆర్డినెన్స్ చేయడం ఉద్యోగులను మోసగించడమేనని యుటిఎఫ్ నాయకులు అన్నారు. శుక్రవారం కెపిపాలెంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక దాన్ని విస్మరించిందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యుటిఎఫ్ కౌన్సిలర్ చింతపల్లి కృష్ణమోహన్, ఎడ్లపల్లి ధర్మారావు, వాటాల సత్యనారాయణ, ఉమాదేవి, కెవి.మంగతాయారు, జితేంద్ర కుమార్, కళాకార్ రాజు, మస్తాన్, శ్రీనివాసరావు, రవి, శ్రీనివాస బాబు పాల్గొన్నారు.

**కాళ్ల:** జిపిఎస్, సిపిఎస్ రద్దు చేసి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్ పట్టాభిరామయ్య కోరారు. శుక్రవారం లక్ష్మీ నరసింహపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై భోజన సమయంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.పట్టాభిరామయ్య, ఉపాధ్యాయులు ఎవివి.సత్యనారాయణ, ఎన్.సీతాదేవి, జిడబ్ల్యూ.విక్లిఫ్ కుమార్, కె.రాంబాబు, కె.కృష్ణమూర్తి ఎన్ఎ.నరసింహరాజు పాల్గొన్నారు.

**తణుకురూరల్** : ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు 2004 తరువాత సర్వీస్‌లో చేరిన వారందరికీ పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిపిఎస్ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం కెబినెట్ సమావేశంలో ఆమోదింపజేసినందుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాప్టో పిలుపుమేరకు అన్ని పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్ పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ విరమణ అనంతరం రూ.వెయ్యి నుంచి రూ.1500 మాత్రమే వస్తుందని, వృద్ధాప్యంలో బతుకు దుర్లభమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు పురపాలక సంఘం ప్రాథమిక పాఠశాల-3 ఉపాధ్యాయులు కె.అంజిబాబు, జె.రాజకుమార్, కె.కామాక్షి, కెఎస్.ప్రదీప్ పాల్గొన్నారు.

# మిగులు భూములను దళితులకు పంచాలి

**రెండో రోజు కొనసాగిన దళిత రక్షణ యాత్ర**

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలోని మిగులు భూములను దళితులకు తక్షణం పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ వి.శివనాగరాణి డిమాండ్ చేశారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన దళిత రక్షణ యాత్ర రెండో రోజు నరసాపురం చేరుకుంది. అరుంధతిపేట, మండవారిపేట, చిట్టవరం, గొంది గ్రామాల మీదుగా సాగింది. ముఖ్య అతిథి శివనాగరాణి మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న సామాజిక, ఆర్థిక అసమానతలపై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి పాలనలో వ్యవసాయ కార్మికుల జీవన పరిస్థితి దిగజారిందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. దళితులకు ఆర్థిక పునాది లేకే వారిపై వివక్ష కొనసాగుతోందన్నారు. మిగులు భూములను దళితులకు పంచాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయకుమార్, కె.క్రాంతి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా నాయకులు కౌరు పెద్దిరాజు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.చైతన్య ప్రసాద్, షేక్ వలీ, సిఐటియు జిల్లా నాయకులు ఎం.త్రిమూర్తులు, నాయకులు పొన్నాడ రాము, ఇజ్రాయేలు, నారాయణరావు, రాఘవులు, గుబ్బల నాగేశ్వరరావు, పోతు శ్రీను పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ

**భీమవరం రూరల్** : కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెక్కంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. దళిత రక్షణ యాత్ర బృందం వెంప పెదపేటకు శుక్రవారం చేరుకుంది. యాత్రకు ప్రజా సంఘాల నాయకులు స్వాగతం పలికారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో సత్యనారాయణ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ నీరు గారుస్తోందన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.కాంతిబాబు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా దళితకాలనీలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు అరుణ్, మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు మంద మార్తమ్మ, భూపతి శామ్యూల్,వి.పండు, ఇ.రమేష్ పాల్గొన్నారు.

యలమంచిలి : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

**యలమంచిలి** : కేంద్ర ప్రభుత్వ మతోన్మాద విధానాలను నిరసిస్తూ ఈ నెల 29వ తేదీన విజయవాడలో చేపట్టనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ వి.శివనాగరాణి పిలుపునిచ్చారు. దళిత రక్షణ యాత్ర రెండో రోజు యలమంచిలి మండలంలో చించినాడ, మేడపాడు, యలమంచిలి గ్రామాల్లో సాగింది. చించినాడలో మహాధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివనాగరాణి మాట్లాడుతూ మణిపూర్‌లో బిజెపి పాలనలో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడం యావత్ భారతదేశం సిగ్గుపడాల్సి వచ్చిందన్నారు. ఇలాంటి ఘటనలు కనీసం పట్టించుకోని ప్రధాని మోడీ సిగ్గుపడాలన్నారు. 29న విజయవాడలో జరిగే మహాధర్నాకు ప్రజలందరూ తరలి రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు కానేటి బాలరాజు, నాయకులు మాచవరపు సుబ్బారావు, స్టాలిన్, ఎం.ఆంజనేయులు, ఏడుకొండలు, దేవ సుధాకర్, ఎం.కృష్ణ, జయశ్రీ, రాఘవులు పాల్గొన్నారు.

**పాలకొల్లు** : దేశంలో ఒకే మతం ఉండాలని తాము చెప్పినట్లు వినాలనే మోడీ ప్రభుత్వ విధానాలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. దళిత రక్షణ యాత్ర శుక్రవారం పాలకొల్లు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ యాత్రలో వ్యకాస నేతలు జక్కంశెట్టి వెంకటలక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, యర్రా అజయ్, పురుషోత్తం పాల్గొన్నారు.

**పెనుగొండ** : దళితుల హక్కులు - సామాజిక న్యాయం కోసం వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఐక్యంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపట్టినట్లు వ్యకాస జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా అన్నారు. దళిత రక్షణ యాత్రలో భాగంగా శుక్రవారం పెనుగొండ బాపూజీపురంలో కరపత్రాలు పంపిణీ చేసి అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 29న విజయవాడలో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యమంలో దళిత, అంబేద్కర్ యువజన, కార్మిక, మహిళా సంఘాలు, వివిధ సంస్థలు, మేధావులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## గొల్లలకోడేరు ఉప సర్పంచి పై సస్పెన్షన్ వేటు

**మూడు నెలల పాటు పదవి నుంచి తొలగించిన జిల్లా కలెక్టర్**

ప్రజాశక్తి - పాలకోడేరు

గొల్లలకోడేరు పంచాయతీ ఉపసర్పంచి కలిదిండి శ్రీనివాస్ వర్మపై సస్పెన్షన్ వేటు పడింది. మూడు నెలల పాటు పదవి నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సస్పెన్షన్ విధించారు. పాలకోడేరు ఇఒపిఆర్‌డి నాగేంద్రకుమార్ సస్పెన్షన్‌కు సంబంధించిన ఉత్తర్వులను గురువారం రాత్రి జిల్లా కలెక్టర్ జారీచేశారు. ఈ పత్రాలను ఉపసర్పంచి శ్రీనివాసవర్మకు అందజేసినట్లు ఇఒపిఆర్‌డి నాగేంద్రకుమార్ తెలిపారు. పంచాయతీ రాజ్ మార్గదర్శ కాలకు వ్యతిరేకంగా పంచాయతీ తీర్మానాలు లేకుండా, టెండర్లు పిలవకుండా వర్క్స్ కమిటీని నియమించకుండా, తన పదవిని, అధికారాన్ని అడ్డు పెట్టుకుని పనులు చేసి నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ పంచాయతీ వార్డు సభ్యుడు కె.బాబూరావు, మరో ఐదుగురు వార్డు సభ్యులు స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి డిఎన్‌పిఒ నాగలత, ఇఒపిఆర్‌డి రెడ్డియ విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు సర్పంచికు చెక్ పవర్ రద్దు చేస్తూ ఉప సర్పంచి అప్పటి పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర కుమార్‌కు అప్పట్లో షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. అయితే కాంట్రాక్టర్లు, గ్రామస్తులు పనులు చేసేందుకు ముందుకు రాకపోవడంతో గ్రామాభివృద్ధి, ప్రయోజనాల దృష్ట్యా తాను పనులు చేశానని ఉపసర్పంచి శ్రీనివాసవర్మ జిల్లా కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. రూ.11 లక్షలు, రూ.40 లక్షలు, రూ.20 లక్షలు విలువైన సీసీ రోడ్లు నిర్మించారని, పంచాయతీ రాజ్ మార్గ దర్శకాల ప్రకారం రూ.5 లక్షలకు మించి పనులు చేసినప్పుడు టెండర్లు పిలవాలని ఆ నిబంధనలు పాటించలేదని రుజువు కావడంతో ఉప సర్పంచి ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదంటూ మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## విద్యుత్ ఉద్యమానికి సన్నద్ధం కావాలి

**27న కలెక్టరేట్ వద్ద ధర్నా - వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశ నిర్ణయం**

ప్రజాశక్తి - భీమవరం

వివిధ రకాల ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలు మోపి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా మరో విద్యుత్ ఉద్యమానికి సన్నద్ధం కావాలని వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ ఛార్జీల పెంపు, సర్దుబాటు, ట్రూ అప్ ఛార్జీలు పెంపును నిరసిస్తూ ఈ నెల 27న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టేందుకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయం తీసుకుంది. పెంచిన ఛార్జీలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించింది. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ, సిపిఎం, ఫార్వర్డు బ్లాక్, ఎంసిపిఐ (యు) నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచిందని విమర్శించారు. ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలు, స్లాబులు కుదించడంతో విద్యుత్ వినియోగదారులపై విపరీతమైన భారాలు పడుతున్నాయన్నారు. ఒక పక్క పెరిగిన విద్యుత్ ఛార్జీలతో సతమతమవుతుంటే ఇళ్లకు, షాపులకు ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఈ నిర్ణయం వల్ల ప్రతి కనెక్షన్‌కూ రూ.13 వేల భారం వినియోదారులపై పడుతోందన్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీల వల్ల లఘు, కుటీర పరిశ్రమలు మూతపడుతున్నాయని పేర్కొన్నారు. కేంద్రంలో మోడీ ఏది చెబితే ఆ విధానాన్ని రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి అమలు చేయడం దారుణమన్నారు. తక్షణం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ప్రజలపై ఎటువంటి భారాలు మోపబోమని ఎన్నికల్లో వాగ్దానం చేసి గద్దెనెక్కిన జగన్ ప్రజా సంక్షేమానికి తూట్లు పొడుస్తూ ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతున్నారన్నారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజల నుండి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి మాట్లాడుతూ విపరీతంగా పెంచిన విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్‌మీటర్ల నిర్ణయాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ నెల 27న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలని రౌండు టేబుల్ సమావేశం నిర్ణయం తీసుకోవడం జరిగింది. ధర్నాలో ప్రజలు పాల్గొని నిరసన తెలియజేయాలని కోరింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు నాయకులు ఎం.సీతారాంప్రసాద్, ఫార్వర్డు బ్లాక్ నాయకులు దండు శ్రీనివాసరాజు, ఎంసిపిఐ (యు) నాయకులు చంటి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

## ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలి : కలెక్టర్

**భీమవరం** : ధాన్యం కొనుగోళ్లను అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2.14 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇ-పంట బుకింగ్ జరుగుతున్న నేపథ్యంలో పంటల సాగు ఆధారంగా ధాన్యం సేకరణకు అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో 409 రైతు భరోసా కేంద్రాలు ఉండగా 387 రైతుభరోసా కేంద్రాల పరిధిలో వరి పంట సాగవుతుందని ప్రాథమికంగా గుర్తించామన్నారు. అక్టోబర్ మొదటి వారం నుండి ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభించడానికి అధికారులు సన్నద్ధం కావాలన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన సామగ్రిని సమకూర్చుకోవాలన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులు సిద్ధంగా ఉంచాలన్నారు. జిల్లాకు కోటి గోనె సంచులు అవసరం అవుతాయని అధికారులు గుర్తించారని వాటిని ముందస్తుగా సమకూర్చుకోవాలని తెలిపారు. ప్రతి మండల తహాశీల్దారు పరిధిలో గోనెసంచులు కొంత స్టాక్ ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరణకు నియమించే ప్రత్యేక అధికారుల ఆధీనంలో తేమ యంత్రాలు ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు టి.శివరామ ప్రసాద్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ఎన్.సరోజ, డిసిఒ ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

## సేవాతత్పరుడు రామచంద్రరాజు

**రామచంద్ర రాజు మృతి పట్ల ఐద్వా సంతాపం**

ప్రజాశక్తి - భీమవరం

సేవాతత్పరుడు, మానవతావాది పెనుమత్స రామచంద్ర రాజు అని, ఆయన అకాల మరణం అత్యంత బాధాకరమని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, సీనియర్ నేత అమ్మాజీ అన్నారు. తణుకు మండలం అజ్జరం గ్రామానికి చెందిన రిటైర్డ్ పంచాయతీ అధికారి పెనుమత్స రామచంద్రరాజు (87) అనారోగ్యంతో మృతి చెందడం పట్ల రమాదేవి, అమ్మాజీ శుక్రవారం ప్రజాశక్తితో మాట్లాడారు. రామచంద్రరాజుకు ముగ్గురు సంతానమని కుమారుడు కృష్ణంరాజు, కుమార్తెలు హైమావతి, అన్నపూర్ణ ఉన్నారన్నారు. తూర్పుగోదావరి జిల్లా మలికిపురంలో రామచంద్ర రాజు పంచాయతీ అధికారిగా పని చేసేవారని తెలిపారు. ఉద్యోగ బాధ్యతల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి అప్పటి కలెక్టర్ చేతుల మీదుగా రామచంద్రరాజు అవార్డు పొందారన్నారు. వివిధ పనుల నిమిత్తం పంచాయతీ కార్యాలయానికి వచ్చిన వారి సమస్యలు పరిష్కరించడంలో ఎంతో కృషి చేసేవారన్నారు. ముఖ్యంగా రైతుల సమస్యలపై రాత్రి సమయం దాటిపోయినప్పటికీ కార్యాలయంలోనే ఉండి సేవలందించేవారన్నారు. ఆపదలో ఉన్నవారికి సాయం అందించడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. అడిగిన వెంటనే కాదనకుండా సాయం అందించే గొప్ప స్వభావం కలవారిని పేర్కొన్నారు. అప్పట్లో జరిగిన ఎన్నికల్లో ఉద్దరాజు రామం పోటీ చేశారని, అయితే రామచంద్రరాజు తల్లిదండ్రులు వెంకటేశ్వరరాజు, అన్నపూర్ణ మొట్టమొదటిసారిగా కమ్యూనిస్టులకు ఓట్లు వేయించిన ఘనత వారికి దక్కుతుందన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలకు సైతం సహాయ సహకారాలు అందించేవారన్నారు. ఇటీవల మహిళా సంఘం చేపట్టిన రాష్ట్ర బస్సు యాత్రకు అడగ్గానే విరాళం అందించారని తెలిపారు. రామచంద్రరాజుకు ఆరోగ్యం సహకరించనప్పటికీ ఆయన కుమారుడు కృష్ణంరాజు ఈ విరాళాన్ని అందించారని చెప్పారు. అలాగే ప్రజా ఉద్యమాలకు ప్రజా సంఘాలకు అనేక విరాళాలు అందించారన్నారు. మృధుస్వభావి, మానవతావాది, సేవాతత్పురుడు, దయాశీలుడు రామచంద్ర రాజు అని తెలిపారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందడం అత్యంత బాధాకరమని తెలిపారు. విజయవాడలో అంత్యక్రియలు జరిగాయని, ఆయన మృతి పట్ల ఐద్వా సంతాపం తెలియజేస్తోందని తెలిపారు. రామచంద్రరాజు కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నామన్నారు.



## 'జగనన్నకు చెబుదాం'కు 19 వినతులు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మండల స్థాయిలో వినతుల స్వీకరణకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని గ్రామస్తుల నుంచి వచ్చిన 19 వినతులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సాధారణంగా ప్రతి సోమవారమూ జిల్లా ప్రధాన కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం, స్పందన కార్యక్రమం నిర్వహించు కోవడం జరుగుతుంబదన్నారు. సెప్టెంబరు 8వ తేదీ నుంచి ప్రతి బుధ, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు మండల కేంద్రాల్లో స్పందన నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రతి మండలాన్ని కవర్ చేసే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్దేశిత తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు వినతులపై పూర్తి శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, డిఎస్‌పి బి.శ్రీనాథ్, తహశీల్దార్ టిపి కృష్ణారావు, ఎంపిడిఒ జి.స్వాతి, ఎంపిపి పి.శిరీష, జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు పాల్గొన్నారు.

వినతులు స్వీకరించి సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

# అధికారులు సమిష్టిగా కృషి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సంయుక్తంగా మ్యుటేషన్స్, స్టోన్ ప్లాంటేషన్, స్వమిత్వ, ఎలక్షన్, హౌసింగ్ తదితర అంశాలపై సంబంధిత డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ అంశాల వారీగా డివిజన్, మండల స్థాయి అధికారులను ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అంశాలవారీగా ఆర్‌డిఒలకు, తహశీల్దార్లకు, ఎంపిడిఒలకు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మ్యుటేషన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల డాక్యుమెంట్లను పూర్తి స్థాయిలో పరిశీలించి మ్యుటేషన్స్ చేయాలన్నారు. జిల్లాలో అధికంగా 40 శాతం మ్యుటేషన్లు రిజెక్ట్ చేసినట్లు చెప్పారు. వాటిని మళ్లీ ఒకసారి పున:పరిశీలించి అవకాశం ఉన్న వాటిపై దృష్టి సారించాలని అన్నారు. తోకలపూడి, నరసింహపురం, పంజా వేమవరం తదితర గ్రామాల్లో 80 శాతం ప్రగతి కనబరిచిన అధికారులను అభినందించారు. ప్రభుత్వ భూములు, ప్రయివేట్ ఇళ్ల స్థలాలు పక్కాగా సర్వే చేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి ఎలక్షన్ కమిషన్ నుంచి వచ్చిన ఎనామలీస్ డేటా జిల్లా నుంచి విడుదల చేసిన డేటాకు నూటికి నూరు శాతం రిఫ్లెక్ట్ అయ్యేలా మండల స్థాయి ఎలక్షన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సర్వే అధికారి జాషువా, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మార్పులు, చేర్పులపై అభ్యంతరాలు తెలపండి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పోలింగ్ స్టేషన్ల మార్పులు, చేర్పుల ప్రక్రియను అత్యంత పారదర్శకతతో చేపట్టామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పోలింగ్‌స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్‌తో పాటు, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఆరు కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 1,460 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వాటిలో 43 పోలింగ్ స్టేషన్ల లోకేషన్ మార్పు కోసం, 207 పోలింగ్ స్టేషన్ల పేరు మార్పు కోసం ఎలక్షన్ కమిషన్‌కు పంపించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, వివిధ పార్టీల ప్రతినిధులు కోమటి రాంబాబు, కోమటి రవికుమార్, శ్యాంబాబు, జెఎన్‌వి.గోపాలన్, టి.వంశీ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్మికులు శుక్రవారం రెండోరోజు కూడా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, అన్ని కేటగిరిల సిబ్బంది వేతనాలు పెంచాలని, పర్మినెంట్ కార్మికుల జిపిఎఫ్ ఖాతాలు సరి చేయాలని, పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పని భారం పెరిగిందని, విస్తరించిన పట్టణాలను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది సంఖ్య పెంచాలని కోరారు. ఈ ధర్నాకు యూనియన్ నాయకులు కె.చంద్రరావు, కె.కాటమరాజు, యు.నాగరాజు, ఎం.రామకృష్ణ, ధనాల రవి, లక్కవరపు శ్రీను, కళింగపట్నం శ్రీనివాస్, శివశంకర్, మండేల్లి పండు, కళింగ శ్రీను, భీష్మ, శారమ్మ సావిత్రి, కనకలక్ష్మి, మర్రి సత్యవతి, కోటమ్మ పాల్గొన్నారు.

## 24న ఉండి ఎఎంసి పాలకవర్గ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ఉండి

ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో ఈ నెల 24వ తేదీన నిర్వహించే నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎఎంసి ఛైర్మన్ బొక్క వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ చేకూరి రాజా నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రమాణస్వీకారం మహోత్సవానికి ముఖ్య అతిథులుగా గృహ నిర్మాణ శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు మేకా శేషుబాబు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, వైసిపి ఉండి నియోజకవర్గ కన్వీనర్ డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు హాజరవుతున్నారని వారు తెలిపారు. వైసిపి కుటుంబ సభ్యులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

## కొడమంచిలిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే

ప్రజాశక్తి - ఆచంట

వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు, అవసరాలు తెలుసుకుని పరిష్కరిస్తారని నరసాపురం డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఒ వరప్రసాద్ అన్నారు. మండలంలోని కొడమంచిలిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సుంకర సీతారామ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ వరప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యవతి, ఉప సర్పంచి ములగాడ వరప్రసాద్, వార్డు సభ్యులు నెక్కంటి రామకృష్ణ, చిలుకూరి శ్రీను, పుచ్చకాయల నాగార్జున, కుసుమె నారాయణమూర్తి, బొంతా సుబ్బారావు, నున్నబోయిన జయలక్ష్మి పాల్గొన్నారు.

**పెనుమంట్ర :** క్షేత్రస్థాయిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో ఆన్‌లైన్ అంతరాయాలు ఉన్నాయని ఎంపిడిఒ పి.పద్మజ అన్నారు. మండలంలోని నత్తా రామేశ్వరంలో డిసెంబర్ మూడో తేదీన నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమానికి ముందస్తు సర్వేను ఎంపిడిఒ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ సర్వే కార్యక్రమంలో అంతా సమన్వయంతో చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాకపోతే ఆన్‌లైన్ చేసేటప్పుడు నెట్‌వర్క్ పనిచే యకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

## చార్ ధాం యాత్రకు యూత్ హాస్టల్స్ సభ్యులు

**పాలకొల్లు :** యూత్ హాస్టల్స్ ఆఫ్ ఇండియా పాలకొల్లు శాఖ నుంచి 40 మంది బృందం చార్ ధాం యాత్రకు శుక్రవారం పాలకొల్లు నుంచి బయిలిదేరారు. వీరికి పాలకొల్లు రైల్వే స్టేషన్‌లో ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు వీడ్కోలు పలికారు. వీరు శుక్రవారం మధ్యాహ్నం విజయవాడలో దురంతో ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి బయలుదేరారు. యూత్ హాస్టల్స్ జాతీయ సభ్యులు కారుమూరి సూర్యనారాయణ సారధ్యంలో బృందంలో 12 మంది మహిళలు ఉన్నారు. అక్టోబర్ ఐదో తేదీ వరకు వీరు చార్ ధాం యాత్రలో పాల్గొంటారు. దేశ వ్యాప్తంగా యూత్ హాస్టల్స్ తరపున జాతీయ ట్రెక్కింగ్, ట్రైనింగ్ కింద ఈ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నారు. గతంలో పాలకొల్లు నుంచి మోటార్ సైకిళ్లపై కన్యాకుమారి, వారణాశి, అయోధ్య, ఢిల్లీ నుంచి లేహ్ యాత్రలు నిర్వహించారు.

## నేరాలు - ఘోరాలు

## రౌడీషీటర్ హత్య కేసులో ఆరుగురు అరెస్టు

### ప్రధాన నిందితుడి కోసం గాలింపు : డిఎస్‌పి శ్రీనాథ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 17వ తేదీన జరిగిన రౌడీషీటర్ విజయ్ హత్య కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్ తెలిపారు. స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ నెల 17వ తేదీన రౌడీషీటర్ భైరవవిజయ్‌ను, తమ్ముడైన గోవిందరావును, అనుచరులను అంతమొందించేందుకు రౌతుల రఘు సిద్ధమయ్యారన్నారు. రౌతుల రఘు అన్నయ్య ఏసు హత్య కేసులో నిందితులైన రౌడీషీటర్ భైరవవిజయ్, అతని తమ్ముడైన గోవిందరావు, మిగిలిన అనుచరులను హత్య చేసేందుకు రఘు తన అనుచరులతో పథకం రచించాడు. ఈ క్రమంలో ఈ నెల 17వ తేదీన పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి తిరిగి తమ ఇంటికి వెళ్తున్న భైరవవిజయ్, భైరవ గోవిందరావును కారుతో వెనక నుంచి ఢీ కొట్టగా ద్విచక్రవాహనంపై వచ్చినవారు కత్తులతో రౌడీషీటర్ విజయ్‌ను హత్య చేశారు. ఈ దాడిలో తప్పించుకున్న విజయ్ తమ్ముడు గోవిందరావు పోలీస్‌స్టేషన్ చేరుకుని ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన టూ టౌన్ పోలీసులు, సిఐ గుత్తుల శ్రీనివాస్ దర్యాప్తుతో ఎస్‌పి రవిప్రకాష్ ఆదేశాల మేరకు హత్యకు పాల్పడిన పెంట శ్యామ్‌కుమార్, మురపాక సాయి దుర్గారావు, పెంట గణేష్, జంగల కుర్తి రామసూర్యసుబ్రహ్మణ్యం, మానకొండ కృష్ణ, కోడలి సతీష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని డిఎస్‌పి తెలిపారు. ఈ హత్యలో ప్రధాన నిందితుడైన రౌతుల రఘు కోసం గాలింపు చర్యలు చేస్తున్నామని, త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

## నరసయ్య అగ్రహారంలో చోరీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక నరసయ్య అగ్రహారంలో చోరీ జరిగింది. వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... అగ్రహారానికి చెందిన తమిళ్‌సెల్వన్ కంటి ఆపరేషన్ నిమిత్తం ఇంటికి తాళం వేసి పొరుగూరు వెళ్లారు. ఈ క్రమంలో దొంగలు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న సుమారు రూ.లక్ష నగదు, విలువైన వస్తువులు అపహరించుకుపోయారు. ఆ పై డాగ్ స్క్వాడ్ వచ్చినా వాసన పసి గట్టకుండా కారం చల్లారు. వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీను తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

## చోరీ కేసులో నిందితుడికి 9 నెలల జైలు

**వీరవాసరం :** వీరవాసరం పోలీస్‌స్టేషన్ పరిధిలో గతేడాది సెప్టెంబర్ ఆరో తేదీన జరిగిన దొంగతనం కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో భీమవరం కోర్టులో న్యాయమూర్తి సురేష్ బాబు నిందితుడు పొన్నాడ రవిశంకర్‌కు తొమ్మిది నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. నందమూరిగరువు గ్రామానికి చెందిన కానూరి గంగాధర శివప్రసాద్ ఇంట్లో జరిగిన దొంగతనంపై దర్యాప్తు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ దొంగతనంపై కేసు నమోదు చేయగా దర్యాప్తులో నేరం రుజువు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

## కలెక్టర్ ప్రశాంతిని కలిసిన గుడాల గోపీ

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లా కలెక్టర్ ప్రశాంతిని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ భీమవరంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు. పాలకొల్లుకు రావాల్సిన పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

## ఇళ్ల నిర్మాణం వేగవంతం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలో జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పిడి)ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని కాళ్లలో జగనన్న గృహ నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. జగనన్న కాలనీలో భవన నిర్మాణ పనులు వేగవంతంగా నిర్మించేలా శ్రద్ధ చూపాలని ఆయన అధికారులకు సూచించారు. లే అవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయడానికి అవసరమైన విద్యుత్, సిమెంట్, ఇసుక తదితర నిర్మాణ సామగ్రిని అందుబాటులో ఉంచాలని, సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమన్వయం చేసుకుంటూ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. లబ్ధిదారులందరికీ బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేయాలన్నారు. ప్రతి జగనన్న లే అవుట్ కాలనీలో ముఖ ద్వార ఆర్చిని త్వరతగతిన నిర్మించాలన్నారు. ఈ పరిశీలనలో హౌసింగ్ ఎఇ పి.ఆంజనేయరాజు, హౌసింగ్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 'సెక్యులర్, సోషలిస్టు పదాల తొలగింపు సరికాదు'

ప్రజాశక్తి - గణపవరం

భారత రాజ్యాంగ పీఠిక నుంచి కేంద్ర ప్రభుత్వం సెక్యులర్ సోషలిస్టు పదాలను తొలగించడాన్ని కెవిపిఎస్ గణపవరం మండల కార్యదర్శి చిననాగేశ్వరరావు శుక్రవారం తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలందని బానిసత్వంగా తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా మరోసారి సామాజిక ఉద్యమానికి మరో స్వతంత్ర పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## వీరబ్రహ్మానికి గ్రామస్తుల సత్కారం

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెం నార్త్ గ్రామానికి చెందిన వాస్తు సిద్ధాంతి ఆముదాలపల్లి వీరబ్రహ్మంను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ నెల 17న విజయవాడలోని తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో నిర్వహించిన అవార్డుల ఫంక్షన్‌లో పలువురు మంత్రుల చేతులమీదుగా వీరబ్రహ్మ వాస్తు జ్యోతిష్య విజ్ఞానంలో ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, జనసేన నాయకులు చాగంటి చిన్న బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచి మేళం బన్ను పాల్గొన్నారు.

## గుండెపోటుతో టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు 18వ వార్డు మాజీ కౌన్సిలర్ భర్త టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి ప్రభుదాస్ (50) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్నేన రోజారమణి తీవ్ర సంతాపం ప్రకటించారు. ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద పలువురు సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి పాల్గొన్నారు.

## గోపీని కలిసిన ఆర్యవైశ్య ప్రముఖులు

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీని ఆ పార్టీ కార్యాలయంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని గోపీకి వినతిపత్రం అందించారు.

## విద్యార్థులకు క్విజ్ పోటీలు

**పాలకొల్లు రూరల్ :** పాలకొల్లు రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్‌లో పాలకొల్లులో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ స్కూల్స్ విద్యార్థులకు శుక్రవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు క్విజ్ మాస్టర్‌గా సీనియర్ రోటరియన్ షేక్ పీర్ సాహెబ్ వ్యవహరించారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామని క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ యూత్ సర్వీస్ డైరెక్టర్ మద్దాల వాసు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్‌రావు, సెక్రటరీ రావాడ సతీష్, మాజీ ప్రెసిడెంట్ చందక రాము, రోటరీ సభ్యులు కానూరి ప్రభాకర్, పోతాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

## రోబోల వినియోగంతో పరిశోధనలు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దేశ రక్షణకు, వ్యవసాయం, ఆక్వారంగం, ప్రకృతిలో మార్పులను అధ్యయనం చేసేందుకు రోబోలతో పలు ప్రయోగాలు చేయాలని ఇంజినీరింగ్ విద్యార్థులకు ఐసిటి అకాడమీ స్టేట్ ఇన్‌ఛార్జి ఎస్.దినకర్ రెడ్డి అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ ఫర్ యూత్ ఎంపవర్మెంట్ కార్యక్రమాన్ని ఐసిటి అకాడమీ, ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ హోనివెల్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్, ఎఐఎంఎల్ విభాగం హెడ్ డాక్టర్ జిఎన్‌విజి.శిరీష ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దినకర రెడ్డి మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులు కంప్యూటర్‌కే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ, ఆక్వా రంగం, హార్టికల్చర్ విభాగాల్లో, రక్షణ రంగంలోనూ రోబోలు సహాయంతో పలు ప్రోగ్రామింగ్స్ రూపొందించి ఆ రంగం ప్రగతికి కృషి చేయాలని కోరారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకష్ణ నిశాంత్ వర్మ, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో రోబోల వినియోగం విస్తృతంగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శిరీష, ప్రశాంత్ పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యున్నతికి సంయుక్త ఒప్పందం

ప్రజాశక్తి - నరసాపురం



ఒప్పందం చేసుకుంటున్న సంస్థ, కళాశాల యాజమాన్యాలు

భీమవరానికి చెందిన ఒమిక్స్ నెక్స్‌జెన్ లెబొరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థతో వైఎన్.కళాశాల సంయుక్త ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఒమిక్స్ నెక్స్‌జెన్ లెబొరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ వారు కళాశాల విద్యార్థులకు స్టూడెంట్స్ ప్రాజెక్ట్స్‌పై శిక్షణ ఇస్తారని, ఎంప్లాయ్‌బిలిటి స్కిల్స్ పెంపొందించేలా అవగాహన కల్పిస్తారని, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారని, వర్కషాపులు నిర్వహిస్తారని, స్టూడెంట్స్‌కి స్టార్టప్స్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడతారని ఒమిక్స్ నెక్స్‌జెన్ లెబొరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. ఈ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పి.మధుబాబు మాట్లాడుతూ నర్సింగ్ కోర్సులు, ఫార్మా కోర్సులు, మెడికల్, హెల్త్ టెక్నాలజీల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా, హెల్త్ కేర్, మెడికల్ చెక్‌అప్ టెస్టింగ్‌లకు ఉన్న డిమాండ్‌పై అవగాహన కల్పిస్తారని, సర్టిఫికేట్ కోర్సులు నిర్వహిస్తారని చెప్పారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ ఈ సంయుక్త ఒప్పందం ద్వారా విద్యార్థులకు ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి పొందేందుకు కావాల్సిన నైపుణ్యాలను పెంపొందించుకునే విధంగా శిక్షణ అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎపివి.అప్పారావు, డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్స్ చింతపల్లి కనకారావు, బెజవాడ వెంకటరత్నం, డాక్టర్ ఎల్.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## కొబ్బరి రైతుల సమస్యలు పరిష్కరించాలి

**వీరవాసరం :** కొబ్బరి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26వ తేదీన నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా, సదస్సు నిర్వహించనున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరే రామ్ తెలిపారు. శుక్రవారం నవుడూరులో కొబ్బరి రైతులతో కలిసి రైతు సంఘం నాయకులు కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఆకుల హరేరామ్ మాట్లాడుతూ కొబ్బరి రైతులందరూ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో కొబ్బరి రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు జుత్తిగ నరసింహమూర్తి, ఆకుల హరేరామ్ తెలిపారు. చెట్టు నుంచి కొబ్బరికాయ కోసి గుట్టగా వేయడానికి కాయకు రూ.మూడు ఖర్చవుతుందన్నారు. ఎకరానికి కొబ్బరి తోటకు రూ.60 వేలకు పైగా పెట్టుబడి అవుతుందని తెలిపారు. రైతు చేతికి కనీస పెట్టుబడి ఖర్చులు కూడా రాక కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి కొబ్బరి ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం వల్లే కొబ్బరి రైతులకు ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. కొబ్బరికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధర ఏమాత్రం సరిపోదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపచేసి కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిలాడి సత్యనారా యణ, తాళ్లూరి హరే రామలక్ష్మణ్, అయినంపూడి బాబూరావు, మైగాపుల త్రిమూర్తులు, చెన్నూరి సుబ్బారావు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న రోడ్లను నిర్మించాలి

**భీమవరం :** పట్టణంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను నిర్మించాలని పట్టణ పౌరు సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో పట్టణ పౌర సమాఖ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైకుంఠరావు మాట్లాడుతూ ఉండి రైల్వే గేటు దగ్గర పూర్తిగా రోడ్లు పాడైపోయినా ఇప్పటివరకు మరమ్మతులు చేయలేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లు దాటినా ఇప్పటివరకు రోడ్లు నిర్మించలేదన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలో రోడ్ల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. వర్షాలు కురిసినప్పుడు రోడ్లపై గోతుల్లో నీరు నిల్వ ఉండటంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాడైన రోడ్లకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సంఘ నాయకులు చల్లబోయిన వెంకటేశ్వర్లు, డి.త్రిమూర్తులు, రాంబాబు పాల్గొన్నారు.

## లార్వా దశలోనే దోమలను నియంత్రించాలి

ప్రజాశక్తి - ఉండి

లార్వా దశలోనే దోమలను నియంత్రించాలని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అన్నారు. మండల వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో భాగంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో శానిటేషన్ చేయించి ప్రజలకు దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రతిఒక్కరూ దోమతెరను వాడాలని వారు సూచించారు. దోమ కాటు వల్ల వచ్చే వివిధ వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. డెంగీ వ్యాధి పట్ల ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది దృష్టికి తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఇంటి పరసరాల పరిశుభ్రత తప్పనిసరి

ప్రజాశక్తి - గణపవరం

ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికినీరు, చెత్త చెదారాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోష్ నాయుడు, పి.కిరణ్మయి సూచించారు. గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో వేలంపేట మూడో సచివాలయం వద్ద స్థానికులకు శుక్రవారం సమావేశం నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్లు పి.సంతోష్ నాయుడు, పి.కిరణ్మయి మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం సరిపల్లి సచివాలయం, గణపవరం సచివాల యం-3 పరిధిలో ఉన్న ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సందర్భంగా వైద్య సిబ్బంది ప్రతిఇంటికి వెళ్లి స్థానికులకు బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు.

## కొడమంచిలిలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని కొడమంచిలి గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వంలో రూ.40 లక్షల నిధులతో వివిధ ఏరియాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. కొడమంచిలిలో శుక్రవారం నిర్వహించిన పంచాయతీ పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో మార్కెట్ సెంటర్ ఎస్‌సి ఏరియాలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. చింతలతోటమెరకలో డ్రెయినేజీ నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు చెప్పారు. పెదపేటకు వెళ్లే మార్గంలో అడ్డుగా ఉన్న షెడ్డును కొంత మేర తొలగించడానికి ఆమోదం తెలిపినట్లు తెలిపారు. గ్రామంలో మెయిన్ స్కూల్ వద్ద, వివిధ ఏరియాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎస్‌సి, బిసి, ఒసి వర్గాల వారికి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

## కొనసాగిన టిడిపి నేతల నిరసనలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబు అరెస్టుపై టిడిపి భీమవరం నియోజకవర్గం ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షను టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ ప్రారంభించారు. టిడిపి నాయకులు శుక్రవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరాహారదీక్ష చేశారు. భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ బలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంట త్రిమూర్తులు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల నాగబాబు, టిడిపి మండల అధ్యక్షుడు రేవు వెంకన్న, భీమవరం పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరి సుబ్బారావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**ఉండి :** రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న నియంత పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని టిడిపి ఉండి నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్ అన్నారు. ఉండి నియోజకవర్గ కేంద్రం ఉండిలో నిర్వహిస్తున్న శుక్రవారంతో పదో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలను పాలకోడేరు మండల మహిళలు అనుబంధ సంస్థల కార్యకర్తలకు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కరిమేరక నాగరాజు, కాగిత బుజ్జి, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, మంతెన సాయి లచ్చిరాజు, కరిమెరక శ్రీనివాస్, మోపిదేవి శ్రీనివాస్, బొల్లం వెంకట్రావు పాల్గొన్నారు.

**తణుకు :** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో టిడిపి నేతలు శుక్రవారం అర్ధనగ్నంగా దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో రాధాకృష్ణతోపాటు అత్తిలి మండలానికి చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం రాధాకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబును ఏదో విధంగా ఇబ్బందులకు గురిచేసి జైల్లో పెట్టి ఎటువంటి భద్రత లేకుండా చేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అరాచకాలకు, దుర్మార్గమైన పాలనకు యువత భవిష్యత్తు సర్వనాశనమైందన్నారు.

**ఆచంట :** చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆచంటలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ కుమారుడు పితాని వెంకట్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 10వ రోజు శుక్రవారం కొనసాగాయి. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోరుగా కురుస్తున్నా లెక్కజేయకుండా దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు పాల్గొన్నారు.

## 28 నుంచి ఎఐఎస్ఎఫ్ జాతీయ మహాసభ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 28వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు బీహార్ రాష్ట్రం బెగుసరాయ్‌లో జరిగే అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) 30వ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.సుందర్, టి.అప్పలస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు మహాసభల కరపత్రాలు పాలకొల్లు ఛాంబర్ డిగ్రీ కళాశాలలో ఎఐఎస్ఎఫ్ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుందర్, టి.అప్పలస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యకు కేటాయించే నిధులు ప్రతి ఏటా తగ్గిస్తుందని, ఎన్ఇపి 2020 అమలులో బాగంగా గ్రామీణ ప్రాంతాల్లో బడుగు, బలహీనర్గాలకు చెందిన విద్యార్థులు పరోక్షంగా విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని, పైగా ఈ నూతన జాతీయ విద్యా విధానం ద్వారా ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు మరింత మేలు చేకూరే పరిస్థితి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు పట్టణ నాయకులు బి.పెద్దిరాజు, ఆర్.మణిదీప్, టి.అంజనాశివాని, ఎం.జ్యోతిర్మయి, కె.వందన, కె.అక్షయ పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, ODUGU SUVARTA, W/O. ODUGU SUVARTHA RAJU, D.NO. 1-207/2, PEDAMAINAVANI LANKA, THURPUTALLU POST, NARASAPURAM (M), W.G.DT. A.P. I HAVE CHANGED MY NAME FROM ODUGU CHANDRA VATHI (OLD NAME) TO ODUGU SUVARTA (NEW NAME) HENCE AFTER ALL MY DOCUMENTS AND CORRESPONDENCE WILL BE COUNTINUE WITH MY NEW NAME ODUGU SUVARTA

CHANGE OF NAME
I, ODUGU SUVARTHA RAJU, S/O. ODUGU VEERLA VENKAYYA, D.NO. 1-207/2, PEDAMAINAVANI LANKA, THURPUTALLU POST, NARASAPURAM (M), W.G.DT. A.P. I HAVE CHANGED MY NAME FROM VADUGU MUTYALA RAJU (OLD NAME) TO ODUGU SUVARTHA RAJU (NEW NAME) HENCE AFTER ALL MY DOCUMENTS AND CORRESPONDENCE WILL BE COUNTINUE WITH MY NEW NAME ODUGU SUVARTHA RAJU

పాస్‌పోర్టు పోయినది
పశ్చిమగోదావరి జిల్లా, గణపవరం మండలం, కోమర్రు గ్రామం, డోర్ నెం. 2-72 చెందిన విప్పర్తి శ్రీను, S/o. విప్పర్తి నరసింహమూర్తి అను నేను ది. 20-08-2023వ తేదీన నెం. K8908954 గల నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టును మా ఇంటి దగ్గర నుండి అనగా కోమర్రు నుండి భీమవరం పాస్‌పోర్టు రెన్యూవల్ నిమిత్తం నా మోటారు సైకిల్ మీద వెళ్లుచుండగా మార్గం మధ్యలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. దొరికినవారు ఈక్రింది నెంబర్‌కి తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.
విప్పర్తి శ్రీను
S/o. నరసింహామూర్తి
కోమర్రు గ్రామం, గణపవరం మండలం
సెల్: 9701153548

In the Court of the Principal Junior Civil Judge, Tanuku
O.S. 199/2023
Between:
Vadapalli Lakshmi ...Plaintiff
AND
Mungara Srinivas, S/o. Anjaneyulu, Hindu, Male, age 53 years, Business, D.No. 4-10, Pali Village, Attili Mandal, TJCJ. ...Defendant
వాది తరపున వేయించిన ప్రకటన
యిందుమూలంగా ప్రతివాదికి తెలియజేయునది, పై నెంబరులో కోర్టు ద్వారా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు సమన్లు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేయించినారు. కావున మీరు ది. 03-10-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షములో దావా విచారించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
తణుకు 20-9-23
గుడిమెట్ల వీర్రెడ్డి
వాది తరపు అడ్వకేటు

ప్రకటన
మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు
E.P. 4/2021 in O.S. 251/2018
Between:
నున్నా చిన సుబ్బయ్య -డిక్రీ హోల్డర్
AND
కొండె సంజీవకుమార్ ...JDR
డిక్రీ హోల్డర్ తరఫున దాఖలు చేసిన పబ్లికేషన్
పై నెంబరు E.P. దాఖలా గ్రంథంలో పై కోర్టు నందు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని డిక్రీ బాకీను రాబట్టు నిమిత్తం ది. 03-10-2023న ఉదయం 10.30 ని॥లకు వేలం వేయుదురు. ఆసక్తి కలవారు సదరు వేలంలో పాల్గొనవచ్చును.
ఆస్తి షెడ్యూలు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఒట్టూరు S.R.O., Pedapadu Mandal పాత ముప్పర్రు గ్రామము మరియు గ్రామపంచాయితీలో R.S. No. 445/3 లో Ac. 1.04 cents వ్యవసాయ భూమికి హద్దులు.
తూర్పు: గొట్టపు ఫ్యామిలీ వారి భూమి.
పడమర: గొట్టపు ఫ్యామిలీ వారి భూమి.
దక్షిణం: మురుగు బోదె. ఉత్తరం: పంట బోదె.
డిక్రీ హోల్డర్ విలువ: రూ. 15,00,000/-
అమీనా విలువ : రూ. 22,00,000/-
B.V.APPA RAO
B.KUMAR
Advocates for D.H.R.
Advocates, Eluru
Cell: 9440188346
Eluru
Dt.21-9-2023